క్లుప్తంగా

అసమ్మతి సెగలు

ములకలపల్లి: ఎన్నికల వేళ బీఆర్‌ఎస్‌లో అసమ్మతి సెగలు రాజుకుంటున్నాయి. పార్టీ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు వైఖరిని వ్యతిరేకిస్తూ పలువురు నాయకులు మంగళవారం జగన్నాథపురంలో సమావేశం నిర్వహించడం చర్చనీయాశంగా మారింది. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఈ సమావేశానికి హాజరుకాగా.. మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు ఏకపక్ష ధోరణిని పలువురు మూకుమ్మడిగా ఖండించినట్లు తెలుస్తోంది. ఇటీవల నర్సాపురంలో శివారులో నిర్వహించిన పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశానికి, ములకలపల్లిలో నిర్వహించిన నామా కార్నర్ మీటింగ్‌లకు తమకు కనీస సమాచారం ఇవ్వలేదని, అందువల్ల హాజరు కాలేకపోయామని మాజీ ఎమ్మెల్యేకు వివరించారు. అప్పారావు ఇష్టారీతిన వ్యవహరిస్తూ, పార్టీకి నష్టం కలిగించేలా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. కాగా, మెచ్చా వారిని సముదాయించేందుకు ప్రయత్నించినా.. వారెవరూ సమ్మతించలేదని తెలిసింది. మరుసటి రోజు అధ్యక్షుడు అప్పారావు సమక్షంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపిన మెచ్చా.. అక్కడి నుండి వెనుతిరిగి వెళ్లినట్లు విశ్వసనీయం సమాచారం.

టీకాలు వేయాలి

అన్నపురెడ్డిపల్లి: పిల్లలకు సకాలంలో టీకాలను వేయాలని జిల్లా మతా, శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చైతన్య వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీలో జరిగిన ఆశాడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గర్భిణుల పట్ల ఆశాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రులలోనే కాన్పులు జరిగేలా చూడాలన్నారు. మాతా, శిశు సంక్షేమంలో రాష్ట్రంలో జిల్లానే మొదటి స్థానంలో ఉందని, సిబ్బంది పనితీరుకు ఇది నిదర్శణం అన్నారు. వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ తన్మయి, సీహెచ్‌ఓ పూలమ్మ, డీపీఎంఓ వెంకటేశ్వరరావు, పీహెచ్‌ఎన్‌ఓ ఎస్తేర్‌రాణి, హెచ్‌ఈఓ కృష్ణయ్య, ఆశాలు పాల్గొన్నారు.

అవగాహన ఉండాలి

భద్రాచలంఅర్బన్: ప్రమాదకరమైన ప్రాణాంతకమైన తలసేమియా వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ చాప్టర్ సొసైటీ ఆఫ్ ఫీటల్ మెడిసిన్ ఎగ్జిక్యూటీవ్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ డాక్టర్ జయ భారతి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్‌ఎల్ కాంతారావు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. మన దేశంలో ప్రతీ సంవత్సరం 10 వేల మంది పిల్లలు తలసేమియా వ్యాధితో పుడుతున్నారని, వారు జీవితాంతం రక్తం ఎక్కించుకుంటూ జీవించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ గర్భిణికి స్క్రీనింగ్ టెస్ట్ చేయడం ద్వారా ఈ వ్యాధిని గుర్తించవచ్చని, ఉమ్మనీరు పరీక్ష ద్వారా కూడా కడుపులోకి శిశువుకు ఈ వ్యాధి ఉందా లేదా అని గుర్తించవచ్చని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: మండలంలోని గంగోలు చెరువు ప్రక్షాళన, లక్ష్మీనగరం నుంచి ఎంపీడీఓ ఆఫీస్ మీదుగా అచ్యుతాపురం గ్రామానికి వెళ్లే రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీఓ ముత్యాలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు మాట్లాడుతూ.. సమస్యను వివరించారు. తెల్లం ధర్మయ్య, సరియం కోటేశ్వరరావు, గుడ్ల రాంబాబు, గట్టుపల్లి శ్రీను, గట్టుపల్లి వెంకటేశ్వరరావు, గట్టుపల్లి వీరస్వామి పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చింది కేసీఆరే..

దుమ్ముగూడెం: పోడు సాగుదారులకు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారయణమూర్తి అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని సీతారామపురం, కమలాపురం గ్రామాలలో జరిగిన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా గిరిజనుల సాగుచేసుకుంటున్న పోడుభూములలో ఫారెస్ట్ అధికారులు అక్రమ కేసులు పెట్టి గిరిజన రైతులను జైళ్లలో పెట్టించిన చరిత్ర అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానిది అని విమర్శించారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి కవితను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దామెర్ల శ్రీనివాసరావు, మోతుకురి శ్రీకాంత్, పోడియం సుబ్బారావు, పూనెం సురేష్ వరస పడిగారాజు, బాలు, నాగరాజు, తునికి బొజ్జి తదితరులు పాల్గొన్నారు.

కవితను గెలిపించండి

మణుగూరురూరల్: పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక వినబడాలంటే ఎన్నికల్లో బీఆర్‌ఎస పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవితను ఎంపీగా గెలిపించాలని మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని గుట్టమల్లారం, సమితిసింగారం గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పని ప్రాంతాల్లో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడారు. మాజీ సర్పంచ్‌లు కారం ముత్తయ్య, ఏనిక ప్రసాద్, మాజీ ఎంపీటీసీలు మేకల రవి, వల్లభనేని రమణ, కొండ్రు మల్లేష్, మండల కోఆప్షన్ సభ్యులు జావిద్ పాషా, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గాలిదుమారం.. వర్షం

- పూరిళ్లపై తీవ్ర ప్రభావం
- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- నేలకొరిగిన వృక్షాలు



చర్ల: మండలంలోని కుదునూరులో ప్రధాన రహదారిపై విరిగిపడిన చెట్టు



అశ్వారావుపేటరూరల్: గాలి దుమారంతో ఆసుపాకలో కూలిపోయిన పూరిల్లు

గుండాల: గుండాల మండలంలో గాలిదుమారంతో కూడిన వర్షం కురిసింది మంగళవారం ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలతో వాన కురిసింది. లొతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అక్కడక్కడ పిడుగులు పడ్డాయి. నిన్నటి వరకు ఎండలు మండిపోగా.. ఈ వానతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.

చర్ల: చర్ల మండలంలో మంగళవారం మధ్యాహ్నం వీచిన భారీ గాలి దుమారం బీభత్సాన్ని సృష్టించింది. ఉన్నట్లుండి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోగా బారీగా గాలలు వీచాయి, బారీ గాలి దుమారంతో మండలంలోని పలు గ్రామాల్లో భారీ వృక్షాలు విరిగి ప్రధాన రహదార్లు, విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో ప్రధాన రహదారులలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగగా, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు గ్రామాల్లోని పూరిళ్ల పైకప్పులు గాలికి లేచిపోయాయి. రైతులు కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం గాలిదుమారానికి కొట్టుకు పోగా పలు చోట్ల కురిసిన వర్షానికి తడిచిపోయింది. మండలంలోని కుదునూరు, చింతగుప్ప, పులిగుండాల, తిప్పాపురం తదితర గ్రామాల్లో ప్రధాన రహదార్లపై చెట్లు విరిగి పడ్డాయి. దేవరాపల్లి, ఆర్ కొత్తగూడెం, కలివేరు, తేగడ, ఆంజనేయపురం గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అతికష్టం మీద మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కూలిన పూరిళ్లు..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కొత్త మామిళ్లవారిగూడెం, ఆసుపాక, వినాయకపురం, వినాయకపురం కాలనీ గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్న సమయంలో వాతావరణం చల్లబడి గాలి దుమారంతోపాటు వర్షం కురిసింది. గాలి దుమారం కారణంగా ఆసుపాక గ్రామానికి చెందిన కుంచం మంగరాజుకు చెందిన పూరిల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న కుటుంబీకులు గమనించి బయటకు పరుగులు తీయడంతో సురక్షితంగా బయటపడ్డారు. దీంతో సుమారు రూ.50వేల దాకా నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు.

భవిష్యత్ బీఆర్‌ఎస్‌దే..



చర్లరూరల్: సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

చర్లరూరల్: రాష్ట్రంలో రాబోయేది మళ్లీ బీఆర్‌ఎస్సేనని ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు దీమా వ్యక్తం చేశారు.మంగళవారం చర్లలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో పది నుంచి పన్నెండు స్థానాల్లో గెలవబోతున్నామని అన్నారు. రాష్ట్రంలో ఆరు నెలల్లో మధ్యంతర ఎన్నికలు వచ్చినా ఆశ్చర్య పోనవసరం లేదని జోస్యం చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎంపీ ఎన్నికలు ధన బలానికి, ప్రజా ఆత్మగౌరవానికి మధ్య జరిగే పోటీగా అభివర్ణించారు. ఈ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా ప్రజా సమస్యల మీద దృష్టి పెట్టలేదని విమర్శించారు.

కవిత గెలుపునకు ప్రచారం..

మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్‌యస్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని కోరుతూ.. చర్ల పట్టణంలో బీఆర్‌యస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు మంగళవారం చర్ల పట్టణంలో ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సోయం రాజారావు.యంపిపి గీద కోదండరామయ్య, దొడ్డి తాతారావు, ఎస్డీ అజీజ్, చింతా నాగబాబు, ఇర్సవడ్ల రాము, దొడ్డి సూరిబాబు, సీతాపతిరాజు, బ్రహ్మానందరెడ్డి, కొప్పినీడు బాబూరావు, మాధవరావు, కాకి అనిల్, సోయం కృష్ణవేణి, పోలూరి సుజాత, కట్టా అమ్మాజి, బీర జయమ్మ, కూర సుజాత పంజా రాజు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: గులాబీ జెండానే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్షని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతరావు అన్నారు.ఈ మేరకు ఆయన మంగళవారం పినపాక మండలంలోని ఏడూళ్ళబయ్యారం అడ్డరోడ్డులోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 9 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా వంటి సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరిందని అన్నారు. మాలోత్ కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని, అందుకు ప్రతి కార్యకర్తా శక్తి వంచన లేకుండా శ్రమించాలని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి,ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఎంపీటీసీ సత్యం, నాయకులు భద్రయ్య, రాము, సత్తిబాబు, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కరకగూడెం: అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించాలని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి పోలీసులకు సూచించారు. మంగళవారం మండలంలోని కొత్తగూడెం, గొల్లగూడెం, చొప్పలా, అనంతారం, పద్మాపురం, చిరుమల్ల పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతారం గ్రామంలో మాట్లాడుతూ.. ప్రలోభాలకు లొంగకుండా, బెదిరింపులు, ఒత్తిళ్లకు పాల్పడకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.



కరకగూడెం: గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

ఎవరైనా నేరాలకు, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడూళ్ళ బయ్యారం సీఐ కరుణాకర్, ఎస్సై రాజేందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

24 గంటలు ఫిర్యాదులు స్వీకరణ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సబ్ డివిజన్ పరిధిలోని బూర్గంపాడు, భద్రాచలం, కరకగూడెం, సారపాక, చర్ల, దుమ్ముగూడెం, అశ్వాపురం,మణుగూరు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ జీవన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల సంభవించిన ఈదురు గాలులకు, వర్షాలకు దెబ్బతింటున్న విద్యుత్ స్తంభాలు, నియంత్రికల పునరుద్ధరణకు సిబ్బంది సన్నదంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఇందు కోసం వినియోగదారులు అంతా ఫిర్యాదు చేసేందుకు గాను 7901628365కు సంప్రదించాలని ఆయన అన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించండి



దమ్మపేట: సమావేశంలో మాట్లాడుతున్న మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రంగారెడ్డి

దమ్మపేట: మతోన్మాద భావాలున్న బీజేపీని, ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని జమేదారుబంజర గ్రామంలో మాస్ లైన్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ.. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీకు ఓటు వేయొద్దని కోరారు. కార్యక్రమంలో నాయకులు అమర్లపూడి రాము, తోడెం దుర్గమ్మ, ఆదినారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మతోన్మాదాన్ని పెంచుతున్న శక్తులను ప్రజాక్షేత్రం నుంచి వెలియాల్సిన అవసరం ఉందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ అన్నారు. మంగళవారం అశ్వారావుపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు కంగాల కల్లయ్య, వాసం బుచ్చిరాజు, గొంది లక్ష్మణరావు, బాడిస లక్ష్మణరావు, భూలక్ష్మి, అర్జున్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మణుగూరుటౌన్: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఎన్‌డీఏ శక్తులను ఓడించాలని పిలుపునిస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ ముద్రించిన ప్రచార కరపత్రాలను పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో పార్టీ డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూధన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మల్సూర్, సతీష్, బుచ్చిరాములు, రామన్న, యాకన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

టీ హబ్ పరీక్షలు..

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం, పర్ణశాల, నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మే నెలలో ఉచితంగా నిర్వహించే టీహబ్ పరీక్షల తేదీలను మంగళవారం ఓ ప్రకటనలో డాక్టర్లు పుల్లారెడ్డి, రేణుకారెడ్డి, సుభాష్‌లు వెల్లడించారు. మే నెల 9, 14, 16, 18, 21, 23, 25, 28, 30 తేదీల్లో పరీక్షలు చేపడుతామని, మండల ప్రజలు ఈ సేవలు వినియోగించుకోవాలని కోరారు. పరీక్షలకు వచ్చేవారు తమ ఆధార్ కార్డు తప్పనిసరిగా వెంట తీసుకుని రావాలని సూచించారు.

అడ్మిషన్లు ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో నూతనంగా మంజూరైన డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఈ విద్యా సంవత్సరం క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ ద్వారా ఈ నెల 25వ తేదీ వరకు ఫ్రీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ మిడియంలో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల్లో బోధన ఉంటుందని, అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ సేవలు పునఃప్రారంభం

అశ్వాపురం: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఆధార్ కేంద్రంలో మంగళవారం నుంచి నిర్వాహకులు ఆధార్ సేవలు పునఃప్రారంభించారు. ఆధార్ కేంద్రంలో సాంకేతిక సమస్యల కారణంగా గత 19 నెలలుగా ఆధార్ సేవలు నిలిచిపోయాయి. 24 గ్రామ పంచాయతీల ప్రజలు ఆధార్ సేవల కోసం దూరప్రాంతాలకు వెళ్తూ ఇబ్బందులు పడ్డారు. ప్రజలు ఆధార్ కేంద్రం సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలెక్టర్‌తో పలుమార్లు సమస్య విన్నవించి పరిష్కరించాలని కోరడంతో జిల్లా కలెక్టర్ ప్రియాంక అల ప్రత్యేక చొరవతో ఆధార్ సేవలు పునఃప్రారంభించారు.

కాంగ్రెస్ ప్రచారం

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రఘురాంరెడ్డిను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అశ్వారావుపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జూపల్లి రమేష్ కోరారు. మంగళవారం మండలంలోని పేరాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు నిమ్మరసం, మజ్జిగ ప్యాకెట్లను అందించారు. అనంతరం వారితో మాట్లాడుతూ.. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్, సంద్రు రమేష్, మిండా హరి, దండా బత్తుల రమేష్, నార్లపాటి దివాకర్, తగరం ముత్తయ్య పాల్గొన్నారు.

అల్లూరి బాటలో నడుద్దాం

చంద్రుగొండ: స్వాతంత్ర సమరంలో బ్రిటీష్ పాలకులను చెమటలు పట్టించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు బాటలో పయనిద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు ఎస్‌కె.ఉమర్ అన్నారు. అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఉమర్ మాట్లాడుతూ.. నేటి యువత మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు వరికూటి వెంకట్రావ్, పద్దం వెంకటేశ్వర్లు, కె.నాగేష్, శ్రీను పాల్గొన్నారు.

గెలుపు కోసం శ్రమించాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మణుగూరురూరల్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ములుగు జిల్లా ఏటూరునాగారం పర్యటనలో భాగంగా ఆయన మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ముఖ్య నాయకులతో చర్చించి పలు సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. ప్రతీ ఒక్కరు హస్తం గుర్తుకు ఓటు వేసేలా కృషి చేయాలని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, మిత్రపక్షాల నాయకులు బొల్లోజు అయోధ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సీనియర్ నాయకుడికి పరామర్శ..

దమ్మపేట: అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడిని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. మండలంలోని పట్వారిగూడెం గ్రామ నివాసి అయిన చెలికాని రంగారావు అనారోగ్య కారణాల వలన చికిత్స పొందిన అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల మంగళవారం, రంగారావును పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఊరికో పార్టీకి ‘సైకిల్’ మద్దతు



కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ స్వామి దొర



దమ్మపేటలో బీజేపీ సమావేశంలో టీడీపీ జెండాలు

అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గంలో మంగళవారం కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ప్రచారం, బహిరంగ సభలు నిర్వహించారు. అయితే ఇరు పార్టీల కార్యక్రమాల్లో.. ప్రచార రథాలతో టీడీపీ జెండాలు దర్శనమిచ్చాయి. ఉదయం దమ్మపేట మండలం గండుగులపల్లిలో జరిగిన బూత్ కమిటీల సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కట్రం స్వామి దొర పాల్గొని ప్రసంగించారు. సాయంత్రం బీజేపీ అభ్యర్థి వినోద్ రావు దమ్మపేటలో నిర్వహించిన బహిరంగ సభాప్రాంగణంలో టీడీపీ జెండాలు నిండుగా ఉన్నాయి. గతంలో ఆపార్టీ నుంచి పలు శాఖలకు మంత్రిగా వ్యవహరించిన తుమ్మల నాగేశ్వరరావు సొంత మండలంలో ఆపార్టీ రెండు పడవల మీద కాళ్లు వేయడంతో ఆ పార్టీతో గతానుబంధం ఉన్నవారు ముక్కున వేలు వేసుకుంటున్నారు.

బలరాంనాయక్‌కు మెజార్టీ ఇవ్వండి

మణుగూరురూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూనవరం గ్రామపంచాయతీలోని పలు బూతులలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాండ్ల సురేష్, బి.త్రిమూర్తులు, దినేష్, నాగేంద్రబాబు, బాలకృష్ణ, నాగరాజు, తాతారావు, ముకేందర్, మహిళా నాయకులు మంగతాయారు, వెంకటరత్నం పాల్గొన్నారు.

అశ్వాపురం: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపు కోరుతూ మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో శివాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామచంద్రాపురం గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద కూలీలను కలిసి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు. సీపీఎం నాయకులు దండి రాములు, బొమ్మరాతి రామయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, సదర్‌లాల్, బేతం రామకృష్ణ, తూము వీరరాఘవులు, ఆవుల రవి, రాగం మల్లయ్య, చెంచల రాము, నరసింహారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నామా గెలుపునకు ప్రచారం



దమ్మపేట: అంకంపాలెంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

ములకలపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి, బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలపరిధిలోని ముత్యాలంపాడులో మంగళవారం విస్తృతప్రచారం చేశారు. ఉపాధి కూలీలను కలసి, కేసీఆర్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు పామర్తి వెంకటేశ్వరరరావు, ఇనుగంటి రాము, బండి కొమరయ్య, పుష్పాల చందర్‌రావు, కొండవీటి రాజారావు, పాలకుర్తి ప్రసాద్, సున్నం బాబూరావు, నాగమణి, బజ్జూరి కృష్ణ, తాటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: బీఆర్‌ఎస్ పార్టీ తరపున ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు మెచ్చా నాగేశ్వరరావు ఉపాధి హామీ కూలీలను అభ్యర్థించారు. మంగళవారం మండలంలోని అంకంపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను, మాజీ ఎమ్మెల్యే మెచ్చా కలసి మాట్లాడారు.

అశ్వారావుపేటరూరల్: ఆరు గ్యారెంటీ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీను పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో నామా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఉపాధి కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, నారం రాజశేఖర్, తాడేపల్లి రవి, మల్లికార్జున్‌రావు, వెంకట నరసింహం పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

చంద్రుగొండ: ఎన్నికల ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహెమాన్ కోరారు. చంద్రుగొండ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ప్రాంగణం నుండి ప్రారంభమైన మార్చ్ గ్రామంలోని వీధులగుండా బస్టాండ్, ప్రధానసెంటర్‌ల మీదుగా సాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు, చుంచుపల్లి సీఐలు ఇంద్రసేన రెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, చంద్రుగొండ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, అన్నపురెడ్డిపల్లి ఎస్సైలు మాచినేని రవి, రమణరెడ్డి, ప్రవీణ్, చంద్రశేఖర్, స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

గుండాల: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సీఐ రవీందర్ అన్నారు. ఈనెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంల పోలీసులు మంగళవారం మండల కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాయితీగా, నిర్భయంగా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతత వాతావరనంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు, గుర్తు తెలియని వారు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



చంద్రుగొండ: ఫ్లాగ్‌మార్చ్‌లో పోలీసులు

భద్రాచలంఅర్బన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పట్టణంలో మంగళవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణ పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలు పాల్గొనగా.. ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని, చట్టవిరుద్ధమైన కార్యక్రమాల సమాచారం అందించాలని కోరారు. సీఐ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.